కొండెక్కిన కూరగాయల ధరలు

- సామాన్యులు కొనలేని పరిస్థితి
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి


హుజూరాబాద్ మార్కెట్ ఏరియాలో కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు

హుజూరాబాద్: కూరగాయల ధరలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయి. నెల రోజుల క్రితం నిలకడగా ఉన్న ధరలు ప్రస్తుతం రెట్టింపయ్యాయి. బీరకాయ, బెండకాయ, చిక్కుడుకాయ, కాప్సికం, మిర్చి, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయల ధరలు సెంచరీ దాటాయి. ఇవి నెల క్రితం రూ.40 పలకగా.. ప్రస్తుతం కిలో రూ.80 నుంచి రూ.100 లోపు ఉండడంతో పేద, మధ్యతరగతి వారికి ఏం కొనాలో పాలుపోవడం లేదు. పెరిగిన ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

సాగు అంతంతే..

కూరగాయల సాగు అంతంత మాత్రంగానే ఉంది. వరుస నష్టాలతో రైతులు కూరగాయల సాగుకు దూరమవుతున్నారు. ప్రభుత్వాలు రాయితీలు ఎత్తేయడం, పెట్టుబడి పెరగడంతో ఉద్యాన సాగు భారంగా మారింది. దీనికి తోడు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. కూరగాయల పంట నిల్వకు కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేకపోవడంతో పలువురు బడా వ్యాపారులు కూరగాయల ధరలను విపరీతంగా పెంచుతున్నారు. దీంతో చిరు వ్యాపారులు ధరలు పెంచి కూరగాయలు వినియోగదారులకు అమ్ముతున్నారు. కూరగాయల పంటల సాగుకు సరైన సాగునీటి వసతులు లేకపోవడంతో రైతులు ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది. క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. తద్వారా అధిక భారమవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. డివిజన్‌వ్యాప్తంగా 928 ఎకరాల్లో కూరగాయల సాగవుతున్నట్లు అధికారుల అంచనా.

ఇబ్బందుల్లో పేదలు

వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా ధరలు తగ్గకపోగా కొద్ది రోజులుగా పెరుగుతున్నాయి. గడిచిన పదేళ్లుగా మే, జూన్, జూలై నెలల్లో కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. జూన్‌లో సాధారణ వర్షాలు కురిశాయి. అక్కడక్కడ టమాట, ఇతర కూరగాయల సాగు కోసం నారు పోశారు. జూలైలో వర్షాలు కురిస్తే కూరగాయలు సాగు చేసే అవకాశముంది. సరైన వర్షాలు లేకపోవడంతో కూరగాయల సాగు సైతం అంతంతగానే మారే అవకాశముంది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు బహిరంగ మార్కెట్‌కు, వారంతపు సంతలకు అధిక ధరలు వెచ్చించి తీసుకురావాల్సి వస్తోంది.

భగ్గుమంటున్న ధరలు

కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. టమాట గత నెలలో రూ.30 ఉండగా.. ప్రస్తుతం రూ.50కి పెరిగింది. బెండకాయ 30 నుంచి 40, పచ్చిమిర్చి 80 నుంచి 100, వంకాయ 40 నుంచి 80, కాకరకాయ 40 నుంచి 80, క్యాలీఫ్లవర్ 60 నుంచి 100, దొండకాయ 30 నుంచి 60, బీరకాయ 60 నుంచి 100కు పైగా, చిక్కుడుకాయ 60 నుంచి 100కు పెరిగింది.

ధరలను నియంత్రించాలి



ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. కూరగాయల ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పేద, మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనలేని పరిస్థితి ఉంది. కిలోకు బదులు పావుకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

– సంధ్య, ప్రైవేట్ స్కూల్ టీచర్, హుజూరాబాద్

కొనలేకపోతున్నాం



ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలు ధరలు చూస్తుంటే భయంగా ఉంది. రూ.500 తీసుకెళ్లినా ఇంటికి సరిపడా కూరగాయలు కొనలేకపోతున్నాం. కూరగాయలు కొనడానికి అంతకుమించి ఖర్చవుతోంది. పెరిగిన కూరగాయల ధరలతో ఆర్థిక భారం పడుతోంది.

– రాజ్‌కుమార్, డ్రైవర్, దమ్మక్కపేట



మానకొండూర్: మండల కేంద్రంలోని కరీంనగర్-వరంగల్ పల్లె మీద చౌరస్తాలో, తూర్పు దర్వాజ వద్ద ఉన్న రహదారిపై భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ దారి గుండా ఇసుక లారీల కారణంగా గుంతలు ఏర్పడ్డాయని, గుంతలు పడి నెలన్నర రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకముందే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి


జిల్లా ఉప వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

హుజూరాబాద్: నిరంతరం రోగులకు సేవలందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ చందుకు వినతిపత్రం అందజేశారు. 104 ఉద్యోగులమైన మాకు ఏప్రిల్ 2025 నుంచి ఎలాంటి కంటిన్యూయేషన్ ఆర్డర్లు లేనందున ఏప్రిల్ మాసం నుంచి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. 2 రోజుల క్రితం మా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అధికారులను కలిసి అడగగా.. ఉద్యోగుల్లో కొందరికి మాత్రమే కొనసాగింపు ఉత్తర్వులు వచ్చాయన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

వీణవంక: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హైదరాబాద్‌లో సిట్ విచారణకు హాజరైన సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు తరలివెళ్లారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం అనేక మంది ఫోన్లను ట్యాప్ చేసిందని ఆరోపించారు. మండల అధ్యక్షుడు బత్తిని నరేశ్‌గౌడ్, జిల్లా నాయకులు గొట్టిముక్కల సంపత్‌రావు, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పర్లపల్లి స్వామి, కొండాల్‌రెడ్డి, ముత్యాల రవీందర్ ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఉడత తిరుపతి(48) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసై ఇంట్లో గొడవలు పడేవాడు. గురువారం ఉదయం ఇంట్లో నుంచి పనికి వెళ్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం శ్రీరాములపల్లి రోడ్డు కట్ట వద్ద పడిపోయి ఉన్నాడని అటు వైపు వెళ్లినవారు తెలపగా.. అక్కడికి వెళ్లి చూసేసరికి పురుగుల మందు తాగి మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్లున్నారు. కూతురు రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడు ప్రభాకర్

శంకరపట్నం: కేశవపట్నం శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మానకొండూర్ మండలం నిజాయితీగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి ప్రభాకర్ మోటార్ సైకిల్‌పై కేశవపట్నం వెళ్తున్నాడు. లారీ–మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రభాకర్‌కు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

పొలంలోనే కుప్పకూలిన వ్యవసాయ కూలీ

సైదాపూర్: ఘనపూర్ గ్రామానికి చెందిన గుంటి అనిల్‌కుమార్(35) అనే వ్యవసాయ కూలీ శుక్రవారం వ్యవసాయ పొలంలోనే గుండెపోటుతో కుప్పకూలాడని సైదాపూర్ ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గురాల మల్లారెడ్డి వ్యవసాయ పొలంలో వరి నాటు వేస్తుండగా.. నారు పంచడానికి వెళ్లాడు. పని చేస్తూ గుండెపోటుతో పొలంలోనే కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. మృతిచెందినట్లు తెలిపారు. అనిల్‌కుమార్‌కు భార్య కోమల, ఇద్దరు కుమారులున్నారు. అనిల్‌కుమార్ తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మురుగు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట

మానకొండూర్: మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు సమీపం నుంచి మురుగు నీరు వెళ్లకుండా కాలువలో సిమెంటు బ్రిక్స్‌తో అడ్డుగోడ నిర్మించి పారిశుధ్య లోపానికి కారణమైన కోలేటి సత్యనారాయణకు నోటీసులు అందజేశారు. జీవో ఎంఎస్ నంబర్ 40 ప్రకారం రూ.3లక్షల జరిమానాతోపాటు 2018 పంచాయతీరాజ్ యాక్ట్ సెక్షన్ 87, 88 ప్రకారం రూ.2లక్షల భారీ జరిమానా గ్రామ పంచాయతీ సెక్రటరీ రేవంత్‌రెడ్డి విధించారు. కొడిత్యాల సత్యనారాయణ అనే వ్యాపారికి రూ.2లక్షల జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: కొండపాక మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. కొండపాక గ్రామానికి చెందిన 2 ట్రాక్టర్లలో ఇసుక నింపుకొని వస్తుండగా పట్టుకొని ఠాణకు తరలించినట్లు వివరించారు. యజమానులైన నాగుల రాజు, ఆవాల గిరిబాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


వాకర్స్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ సభ్యులు


రాఖీ కడుతున్న కాంగ్రెస్ నేత స్వరూప


వి.నరేందర్‌రెడ్డికి రాఖీ అందజేస్తున్న చిన్నారులు

సోదరభావంతో మెదలాలి

హుజూరాబాద్: ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెదలాలనే సందేశాన్ని తెలియజేయడమే రక్షాబంధన్ ఉద్దేశమని బ్రహ్మకుమారీలు శ్రీవాణి అన్నారు. శుక్రవారం రాఖీ పండగ విశిష్టతను వివరిస్తూ పట్టణంలోని ప్రభుత్వ క్రీడామైదానంలో ఉదయం వాకర్స్‌కు రాఖీలు కట్టారు. రక్షణ అంటే విలువలను పెంపొందించుకోవడం, మనం ఏర్పర్చుకున్న విలువలను కాపాడుకుంటూ జీవించడమన్నారు. జ్యోతిరాణి, రాజయ్య, నిరంజన్, విశ్రాంత పీఈటీ రాజిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల గోవర్దన్, ప్రతాప రమేశ్, వర్థినేని సురేందర్‌రావు, వెంకటరమణ, దొరైరాజు, నరేందర్‌చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి స్వరూప శుక్రవారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. మండలంలోని కాంగ్రెస్ నేతలకు రాఖీ కట్టారు. పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఏఎంసీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మునిగాల చందుగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, స్వప్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం రాఖీ వేడుకలను ముందస్తుగా జరుపుకున్నారు. రాఖీని విద్యార్థులు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డికి కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో వరలక్ష్మి దేవత పూజలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి రాఖీ కట్టిన నాయకురాలు



తిమ్మాపూర్: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ అనితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆపరేషన్ సింధూర్‌కు నాయకత్వం వహించే అవకాశం మహిళలకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ కట్టారు. మహేందర్, మహేశ్, సంతోష్, యోగి రాజు, చిత్తరంజన్, ప్రవీణ్, తరుణ్‌రెడ్డి, అశోక్ ఉదయ్, నరేశ్, భరత్, రామకృష్ణ, సుధీంద్రశర్మ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడికే కార్డన్ సెర్చ్


పాల్గొన్న ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ, పోలీసులు

జమ్మికుంట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి అసాంఘిక కార్యకలాపాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. మడిపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరస్తులు మాయమాటలతో బ్యాంక్ ఖాతాలోని డబ్బులు కాజేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో డాగ్ స్క్వాడ్‌తో ఇంటింటా తనిఖీ నిర్వహించి అనుమానితులను ప్రశ్నించారు. పత్రాలు లేని 59 వాహనాలను గుర్తించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మినారాయణ, హుజూరాబాద్, కరీంనగర్ సీఐలు కర్ణాకర్, పుల్లయ్య, శ్రీనివాస్, ఎస్‌ఐలు సతీశ్, శేఖర్‌రెడ్డి, తిరుపతి, యూనిస్ అహ్మద్ అలీ, తిరుపతి, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 89 డిస్ట్రిక్ గార్డులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా బీఆర్‌ఎస్

చిగురుమామిడి: రేకొండ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దుడ్డేల లక్ష్మినారాయణ అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందాడు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ లక్ష్మినారాయణ పార్థివ దేహంపై బీఆర్‌ఎస్ పార్టీ క్లాత్ కప్పి పూలమాల వేసి నివాళి అర్పించారు. లక్ష్మినారాయణ మృతి చాలా బాధాకరమని, ఒక మంచి నాయకున్ని కోల్పోయామని, ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. మామిడి అంజయ్య, హన్మాండ్ల సత్యనారాయణ, బెజ్జంకి రాంబాబు ఉన్నారు.

యూరియా కొరత లేదు

సైదాపూర్: మండలంలో రైతులకు యూరియా కొరత లేకుండా జిల్లా వ్యవసాయ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని మండల వ్యవసాయాధికారి వైదేహీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఎంఎస్, పీఏసీఎస్, ఎఫ్‌పీవో, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

ఎల్‌వోసీ అందజేత

వీణవంక: ఘన్ముక్కుల గ్రామానికి చెందిన శంకరాచారి అనే వ్యక్తి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఆశ్రయించగా.. వెంటనే రూ.2లక్షల ఎల్‌వోసీ ఇప్పించినట్లు ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి తెలిపారు.

యూరియా కొరత లేకుండా సరఫరా


మానకొండూర్: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: రైతులకు అవసరమైనంత మేరకు యూరియా బస్తాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ అన్నారు. గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 70 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.18.73లక్షల విలువైన చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. రాష్ట్రంలో యూరియాకు కొరత లేదని, బీఆర్‌ఎస్ నాయకులు యూరియా కొరత ఉందంటూ దుష్ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, కాంగ్రెస్ గన్నేరువరం మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, బుర్ర శ్రీధర్‌గౌడ్, మాతంగి అనిల్, బొడ్డు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. 208 మంది లబ్ధిదారులకు రూ.55.99లక్షల విలువైన చెక్కులు అందజేశారు. నందగిరి రవీంద్రచారి, మర్రి ఓదెలుయాదవ్, రామిడి తిరుమలరెడ్డి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, తాళ్లపల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తీరును చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తిపోతున్నాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్‌ఎండీకాలనీలోని ప్రజాభవన్‌లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 148 మంది లబ్ధిదారులకు రూ.42.17లక్షల విలువైన చెక్కులతోపాటు మరో 18 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు బండారి రమేశ్, బ్లాక్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, గోగూరి నరసింహారెడ్డి, గొట్టిముక్కల సంపత్‌రెడ్డి, బుదారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్యగౌడ్, పోలు రాము, రమేశ్, ముప్పిడి సంపత్‌రెడ్డి, కంది అశోక్ రెడ్డి, ఎలుక రాజు, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆశిక్ పాషా, గుంట మల్లేశం, మార్క నర్సయ్య, లక్ష్మారెడ్డి, వరాల అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘం కమిటీ ఎన్నిక



తిమ్మాపూర్: ఎస్సీ మాదిగ కుల సంక్షేమ సంఘం రేణికుంట గ్రామ పెద్ద మనుషులను శుక్రవారం కుల సంఘం ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయిని రాములు(పులి), ఉపాధ్యక్షుడిగా బోయిని(బొకే) చంద్రయ్య, కోశాధికారిగా బోయిని సంపత్‌కుమార్, పెద్ద మనుషులుగా బోయిని చంద్రయ్య(బచ్చె), బోయిని జలంధర్, బోయిని కనకయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన కుల పెద్ద మనుషులు మాట్లాడుతూ.. కుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఊరు మీద కులానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలకు బాధ్యత వహిస్తామని తెలిపారు. మాజీ వార్డు సభ్యులు బోయిని శంకర్, బోయిని వీరయ్య, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని సతీశ్, బోయిని(బొకే) శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2 రోజులు పత్తి మార్కెట్‌కు సెలవు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌కు రైతు 10 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా.. శుక్రవారం క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,550 పలికింది. శనివారం రాఖీ పండుగ, ఆదివారం సాధరణ సెలవుల సందర్భంగా 2 రోజులు మార్కెట్‌కు సెలవుంటుందని ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్ -2 కార్యదర్శి రాజా తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు చీరలు అందజేత

జమ్మికుంట: హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్ తల్లి కీశే మదిర రామమ్మ రెండో వార్షిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం 30 మంది మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ ఎండీ అయాజ్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం శ్రమించే మహిళా కార్మికులను గుర్తించి చీరలు అందించడం అభినందనీయమన్నారు. మేనేజర్ రాజిరెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ


దివ్యాంగులకు అవగాహన కార్యక్రమం

మానకొండూర్: యూత్ 4 ఫౌండేషన్, సంస్థ సహకారంతో దివ్యాంగులకు జిల్లాలోని 8 మండలాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ తెలంగాణ అసిస్టెంట్ మేనేజర్ మొహమ్మద్ షాహిద్, మోరే కృష్ణ తెలిపారు. శుక్రవారం గన్నేరువరం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఉపాధిపై ఉచిత శిక్షణ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగులకు కంప్యూటర్, టైలరింగ్, ఎలక్ట్రిషన్, ప్లంబింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో 30 రోజుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. దరఖాస్తుకు గన్నేరువరం మండల కేంద్రంలోని సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న యూత్ 4 ఫౌండేషన్ శిక్షణ కేంద్రంలో ఫోన్ నంబర్ 9281152803లో సంప్రదించాలన్నారు. కోఆర్డినేటర్ పాశం ఎల్లయ్య, మల్టీ ట్రైనర్ బత్తిని శారద, కొలుపుల మహేందర్, మొగిలి ఐలయ్య, కొండా శ్రీనివాస్, బుర్ర రామచంద్ర, ముక్కెర భూమయ్య, బుర్ర భారతి, సంధవేణి తిరుపతి, కాంతాల వసంతరెడ్డి, తిప్పర్తి ఉపేందర్, రామంచ మల్లేశం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

వీణవంక: ఎల్బాక గ్రామంలో గ్రామ స్వరాజ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్(పెద్ద మేకర్స్) శిక్షణ కేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్ పుల్ల సుజాత, పీఏసీఎస్ చైర్మన్ మవురపు విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత శిక్షణతోపాటు శిక్షణ అనంతరం సబ్సిడీపై నాణ్యమైన మిషన్లు అందజేస్తారని తెలిపారు. ప్రతీ గ్రామంలో నెల రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. మండల శిక్షకురాలు ఐరిని ఇందిరా, జీపీ కార్యదర్శి ఐలోనియాదవ్, సీఐటీయూ నేత పిల్లి రవియాదవ్, తప్పేట రమేశ్, రవి, మహిళలు పాల్గొన్నారు.

సన్మానం


సన్మానిస్తున్న రేషన్ డీలర్లు, కార్యాలయ సిబ్బంది

మానకొండూర్: గన్నేరువరం మండలం తహసీల్ కార్యాలయంలో పని చేస్తున్న ఆర్‌ఐలు రజనీకాంత్ రెడ్డి, రఘు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో గంగాధర మండలం నుంచి కె.ప్రవీణ్, చొప్పదండి మండలం నుంచి టి.త్రిపాల్‌సింగ్ బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రణీత్, అధికారులు, సిబ్బంది, రేషన్ డీలర్లు స్వాగతం పలికారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బోడ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు శాలువాలతో సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, జూనియర్ అసిస్టెంట్ చంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



హుజూరాబాద్: కేసీ క్యాంపులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, సుదర్శన నారసింహ ఉత్సవ మూర్తి ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నూతన ఉత్సవ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు 3 రోజుల నుంచి ప్రారంభమయ్యాయి. అర్చకులు నిఖిలాచార్యులు, నందకిశోరాచార్యులు, శ్రీహర్షచార్యులు, సుదర్శనాచార్యులు, రామాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విగ్రహాలను గూడూరు ప్రభాకర్‌రెడ్డి సుమావాణి, ఊరడి సుగుణ సుధాకర్‌రెడ్డి, పీవీ నరేశ్, సుజాత సారయ్య, జ్యోతి చందా నగేశ్, రాజు, సురేందర్, గణపతిరెడ్డి బహూకరించారు. శుక్రవారం ఆలయంలో ప్రాయశ్చిత్త హోమం, మహా పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలతోపాటు నేత్రోన్మీలనం, కుంభప్రోక్షణ, ద్రిష్టి కుంభ, శాంతి కల్యాణం, ఋత్విక్ గరణం, మహదాశీర్వచనం, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

వరలక్ష్మి వ్రతం పూజలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీవిశ్వేశ్వరస్వామి దేవాలయంతోపాటు పలు ఆలయాల్లో శ్రావణ మాసం పర్వదినం పురస్కరించుకొని శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో సందడి నెలకొంది. దేవతామూర్తులకు ఒడి బియ్యం సమర్పించారు. మహిళలు ఇంటి వద్ద ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుంటూ ఆశీర్వాదం తీసుకున్నారు.

వైభవంగా శ్రీదుర్గాదేవి ప్రతిష్ఠ


పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: వెలిచాల గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీదుర్గామాత దేవాలయంలో శ్రీదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వేదపండితులు శ్రీనంబి వేణుగోపాలాచార్య ఆధ్వర్యంలో వెలిచాల ధార్మిక ట్రస్టు వైభవంగా నిర్వహించారు. రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వేంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ వీర్ల కవిత, దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ వీర్ల సరోజనతో వేద పండితులు వేద స్వస్తి, ప్రాతఃకాల పూజలు, ప్రాసాద వాస్తు, ప్రాసాదన్యాసము, గర్తన్యాసము, బీజన్యాసము, రత్నన్యాసము, ధాతున్యాసము, మధ్యాహ్నం యంత్ర స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొని ప్రత్యేకంగా పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.